కథా నిలయం
4629
శ్రీకాకుళం

# మల్లెపూవు

ట్రెయిన్ గూడూరు స్టేషను వదలబోతోంది. అప్పుడే టిక్కెట్టు తీసుకున్న కుమార్ హడావిడిగా ప్లాట్ ఫారం మీదికొచ్చి ఎదురుగా ఉన్న కంపార్టుమెంటు లోకి దూరేడు.

చేతిలో మెడికల్ బేగ్‌ని పక్కనే పెట్టి కర్చీఫ్‌తో స్వేద బిందువులను సుతారంగా అద్దుకున్నాడు.

ఫిల్టర్ సిగరెట్ కింగ్ సైజు వెలిగించి చుట్టూ చూశాడు.

తాను నిల్చున్న ప్రదేశానికి ఎదురుగా ఉన్న రెండు వరసల్లో ఒక వైపు మగాళ్ళు, మరో వైపు లేడీసు కూర్చుని ఉండటం గమనించాడు. తాను కూర్చునేటందుకు ఎక్కడా చోటు కనిపించ లేదు.

ఎప్పుడూ ఫస్ట్ క్లాసులో తప్ప ప్రయాణం చేయని కుమార్ సీటు దొరక్కపోవటంతో సెకండ్ క్లాసులో వెళ్ళాల్సి రావటం తప్పనిసరైంది.

కూర్చునేటందుకు ఎవరైనా సీటిస్తారేమోనని జాలిగా అందరి ముఖాల్లోకీ చూశాడు. అయినా మగాడు స్టాండింగు పాసింజరైతే ఎవరికి జాలి...నిల్చుని ప్రయాణం చేసేటందుకే నిర్ణయించుకున్నాడు కుమార్.

బిగుతుగా ఉన్న నెక్ టై వదులు చేసుకున్నాడు. కుడి చేత్తో కర్లీ హెయిర్ మరో సారి సవరించుకున్నాడు.

నిల్చున్న కుమార్ చుక్కల్లో చంద్రుడిలా కనిపించాడో ఏమో, లేడీస్ వరుసలో కిటికీ పక్కగా కూర్చున్న సుకుమారి అతనికేసి వోరకంట చూస్తోంది. 'అయ్యో, పాపం! అందమైన కుర్రాడు నిల్చుని ప్రయాణం చేయాల్సి వచ్చిందే' అనే జాలి ఆమె చూపులో మిళితమైంది. ఆమె చూపులో భావాన్ని గ్రహించగలిగేడు కుమార్.

ఆమెకి ఎదురు వరుసలో కూర్చున్న పాతికేళ్ళ కుర్రాడి కేసి చూచి నవ్వింది. కళ్ళతో ఏదో సైగ చేసింది.

ఇంతసేపూ సుకుమారి ఒంటరిగానే ప్రయాణం చేస్తూందని అనుకుంటున్న కుమార్ తీరా ఎదురు వరుసలో ఉన్న కుర్రాడితో మూగగా మాట్లాడటంతో కొంచెం కంగారు పడ్డాడు.

'ఎదురుగా కూర్చున్న కుర్రాడు ఆమె కేమైఉంటాడు తన గురించి సైగచేసి ఏదో సంకేతాన్ని తెలీపర్చిందంటే. అతను తప్పకుండా ఆమె భర్త అయి ఉండాలి!' ఈ ఆలోచన రాగానే కుమార్ కళ్ళు ఆమె మెడను, కాళ్ళను... అంటే పాదాలను వెతికాయి.

పెళ్ళి అయిన ఆనవాలు ఎక్కడా కనిపించక పోయే సరికి, బహుశా ఆ కుర్రాడు ఆమె తమ్ముడో, అన్నయ్యో అయి ఉండాలి అనుకున్నాడు.

క్షణం క్రితంవరకూ ఆ సుకుమారికేసి క్రీగంట చూస్తున్న వాడల్లా, ఆమె కో మగతోడు ఉందనే విషయం గ్రహించగానే, ఆమె కేసి పదే పదే చూచేటందుకు సాహసించలేకపోయాడు కుమార్!

ఆమె ఎంత అందంగా ఉంది. తెల్లగా మల్లెపువ్వులా ఉంది. నిండైన చెక్కిళ్ళు...దొండపండులాంటి అధరాలు... చేప కళ్ళు... చక్కని పలు వరుస... పాపిట సిందూరపు బొట్టు... ఖరీదైన సిల్కు చీరె... మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేట్టుగా, ముగ్ధమోహనంగా ఉంది.

ఆమె ఎదురు వరుసలో కూర్చున్న పాతికేళ్ళ కుర్రాడు టక్కున లేచి నిలబడి "మీరు నా సీట్లో కూర్చోండి, సార్..." అంటూ సీటు ఆఫరు చేయటంతో కుమార్‌కి మతి పోయినట్లనిపించింది.

సీటు ఇచ్చింది ఆ కుర్రాడే అయినా, తీరా కూర్చున్న తర్వాత మల్లెపువ్వు కేసి వోరకంట చూస్తూ, కళ్ళతోనే 'థేంక్స్' చెప్పేడు కుమార్.

ప్రయాణాల్లో తారసపడే మనుష్యుల మనస్తత్వాల గురించి కాచి వడపోసినంత అనుభవం కుమార్‌కి ఉంది. – అందు క్కారణం – అతని ఉద్యోగం అలాంటిది. నెలకు ఇరవై అయిదు రోజులు కేంపుల మీద ఆ వూరు ఈ వూరు తిరగాల్సి వస్తుంది.

ప్రయాణాల్లో పరిచయమయ్యే వ్యక్తులు కొంత సేపయ్యాక ఆత్మీయులుగా కనిపిస్తారు. తీరా ఎవరి వూళ్లో వారు దిగిపోయేటప్పుడు ఏదో పోగొట్టుకున్న వారిలా ఫీలవటం సహజం. కుమార్‌కి అన్నీ తెలుసు.

"మీ పేరు..." సహృదయంతో తనకు చోటిచ్చిన కుర్రాడిని పరిచయం చేసుకోవాలనే ప్రయత్నంలో అతగాడి కేసి చూస్తూ అడిగేడు కుమార్.

"నా పేరు సాగర్! మా అక్క పేరు మల్లీప్రియ." క్లుప్తంగా జవాబిచ్చాడు.

అతగాడు చెప్పిన జవాబు తీరు చూస్తుంటే ఇంటర్వ్యూ లో అడిగిన ప్రశ్నకు టక్కున సమాధానం ఇచ్చినట్లనిపించింది కుమార్ కి.

మల్లీప్రియ! నిజంగా ఎంత అందమైన పేరు!! ఆమె పేరు మొదట్లో తెలీక పోయినా ఆమె సౌందర్యానికి ముగ్ధుడై ముద్దుగా, మల్లెపూవు' అనేసి తన్లో తాను పిల్చుకున్నాడు.

సాగర్ ని చూస్తుంటే కాటన్ గుడ్డల్లో ఏదో సాధారణమైన ఉద్యోగం చేస్తున్న కుర్రాడిలా కనిపించాడు - అతగాడి అక్క చూడబోతే అపురూప సౌందర్యరాసిలా, అందాల భరిణలా మెరిసిపోతూ ఉంది. అక్కా తమ్ముళ్ళ మధ్య ఎంతటి వ్యత్యాసం? ఇతనిలో? సింప్లిసిటి... ఆమెలో దర్పం-ఎంతటి తేడా?

మల్లీప్రియని పొందగల అర్హత ఎవరికుందో? ఆమెకు రాబోయే భర్త ఎంతటి అదృష్ట వంతుడో?... చూచిన వాళ్ళు తెలిసీ ఫీలయ్యేటంత అందంగా ఉందామె. ఆమె నుండి చూపు మరల్చుకోలేని బలహీనుడవుతున్నాడు కుమార్.

కుమార్ చూపు ఆమెను కుదిపేస్తోంది. ఆమె పైట నిండుగా కప్పుకుని కూర్చుంది. కిటికీలోంచి బయటకి చూస్తోంది.

తాను తొందర పడకూడదు అనుకుంటూ తన దృష్టిని సాగర్ కేసి మరల్చాడు కుమార్.

ఎవరితను? ఏం ఉద్యోగం చేస్తున్నాడు? ... ఎంత కాస్ట్లీగా ఉన్నాడు! కోలముఖం... ఉంగరాల జుట్టు ... కుడి చేతికి వాచీ ... రెండు ఉంగరాలు ... ఖరీదైన డ్రస్సు... హైహీల్స్ బూటు ... ఎవరబ్బా ఈ అందగాడు? ... ఇతనికి పెళ్ళయిందో లేదో? – ఇతని ప్రయాణం ఎక్కడి దాకా?... అలా కొరుక్కు తినేట్టు తన కేసి పదే పదే చూస్తాడేమిటి?... అనేసి రకరకాలుగా కుమార్ ని గురించి తలపోస్తోంది మల్లీ ప్రియ.

ఆడదానికి పెళ్ళయితే మెడలో మంగళసూత్రలు కాలికి మెట్టెలూ ఉంటయ్! మరి... పెళ్ళయిన మగాడికి గుర్తేమిటి? – ఇతడ్ని చూస్తుంటే స్లిమ్‌గా, హేండ్సంగా ఉన్నాడు... ఒకవేళ ఇతగాడికి కనుక పెళ్ళి అయి ఉంటే భార్య ఎంతటి అదృష్టవంతురాలో... ఎన్నో రకాల ప్రశ్నలు.. సమాధానాలు మల్లీప్రియలో ఉత్పన్నమయినాయ్.

అబ్బ!... ఎంత సేపీ మవునం?— ట్రెయిన్ ఏదైనా పెద్ద స్టేషన్లో త్వరగా ఆగితే బావుండును – సాగర్ ప్లాట్ ఫారం మీదికి దిగగానే మల్లీ ప్రియతో మాట కలవచ్చు... కనీసం ఆమెను పలుకరించే అవకాశం కలుగుతుంది అని మద నపడ సాగేడు కుమార్.

క్షణాలు గంటల్లా దొర్లి పోతున్నాయ్.

ట్రెయిన్ నెల్లూరు స్టేషన్లో ఆగింది. హమ్మయ్య అనుకున్నాడు కుమార్. తాను వూహించినట్టే సాగర్ ప్లాట్ ఫారం మీదికి దిగేడు – 'మే గాడ్ బ్లెస్ హిమ్' అనుకున్నాడు కుమార్.

"మీరు కాఫీ ఏమైనా తాగుతారా?..." మళ్లీ ప్రియను ఉద్దేశించి అడిగేడు కుమార్.

ఆమె తల అడ్డంగా ఆడించటంతో కుమార్ కి మధ్యాహ్నం ఎదురయింది పలుకే బంగారమాయె అని వాపోయాడు అంతరాంతరాల్లో.

"పోనీ... ఏదైనా చదువుతారా కొనుక్కొస్తాను." మరో ప్రశ్న విసిరేడు వలపన్నే ప్రయత్నంలో.

మౌనం అర్ధాంగీకారంగా భావించి సీట్లో కూర్చున్నవాడల్లా లేచి బుక్ స్టాల్ దాకా వెళ్ళి ఒక తెలుగు వారపత్రిక... ఫిలింపేరు కొనుక్కొచ్చి మళ్ళీ తన స్థలంలో కూర్చుండిపోయాడు.

"ఈ మేగజైన్ చూడండి. మౌనంగా ఉంటే మరీ బోర్ గా ఉంటుంది..." వీక్లీ అందిస్తూ అన్నాడు కుమార్.

వారపత్రిక చేతిలోకి తీసుకోగానే ఆమె సినీమా శీర్షిక చదవ నారంభించింది.

ఆమె చర్య పసిగట్టిన కుమార్ కి మాట్లాడేందుకు మంచి అవకాశం దొరికినట్లయింది.

"నేను తెలుగు పిక్చర్సు చూడనే చూడను" అన్నాడు ఆమెకేసి చూస్తూ.

"ఎందుకని?" అన్నట్టు ప్రశ్నార్థకంగా ఆమె కుమార్ ముఖంలోకి చూచింది.

"తెలుగు సినిమాల్లో అన్నీ అసభ్య దృశ్యాలు.... అర్ధనగ్న నృత్యాలే!... అవంటే నాకు పరమబోర్" అన్నాడే గానీ తాను చూచేవన్నీ తెలుగు పిక్చర్లే! అలా మాట్లాడినందు వల్ల ఆమె ఫీలింగ్సు ఎలా ఉంటాయో గమనించాలనే ఉద్దేశంతో ఆ విధంగా బొంకేడు - అంతే!

వీక్లీలో వున్న బొమ్మకేసి వేలుపెట్టి చూపిస్తూ "ఈ నర్తకి డ్యాన్సు వున్న ప్రతి సినీమా నేను విధిగా చూస్తాను.." అంది. ఆ తరువాత నవ్వింది.

"డాన్సంటే మీకు అంత ఇష్టమా? - "

మళ్ళీ ప్రియ తల ఆడించింది.

"ఐ లైకిట్ వెరీ మచ్!..." టక్కున అనేసి పదునైన చూపొకటి ఆమెకేసి విసిరేడు కుమార్.

కుమార్ చూపు ఆమె గుండెలో గుచ్చుకుందో ఏమో తొట్రుపాటుతో ఆమె పైట సవరించుకుంది. ఆ తరువాత సిగ్గుపడ్డది.

ఇప్పుడిప్పుడే లైన్ క్లియర్ అవుతూంది. తరువాత గ్రీన్ సిగ్నల్ ఇవ్వటమే తరువాయి అనుకున్నాడు.

రైలు కూత పెట్టింది. సాగర్ కంపార్టుమెంటులో కొచ్చేశాడు. కుమార్ పక్కనే వున్న ఖాళీ స్థలంలో కూర్చుండి పోయాడు.

కుమార్‌లో వున్న ఉత్సాహానికీ, ఆలోచనలకీ బ్రేకులు పడ్డాయ్.

ఎర్రజెండా వూపే గార్డుగాడిలాగా మధ్యలో సాగర్ గాడొకడు అనేసి లోలోపల తిట్టుకున్నాడు.

మల్లిప్రియ చేతిలో వీక్లీ లాక్కొని తాను చూడటం మొదలు పెట్టేడు సాగర్.

"మీ ప్రయాణం ఎక్కడిదాకా..." సాగర్‌ని ఉద్దేశించి అడిగేడు కుమార్.

ఆ ప్రశ్న వినగానే ఒకసారి తలెత్తి మల్లిప్రియ ముఖంలోకి చూచి మళ్ళీ ముఖం పక్కకు తిప్పుకుని "విజయవాడ వెడుతున్నాం..." అని ముక్తసరిగా జవాబిచ్చాడు సాగర్.

"వెరీ గుడ్! - నేనూ అక్కడికే..... ఇంకేం - మనం కలిసి చాలాసేపు ప్రయాణం చెయ్యచ్చు..." ఫిల్టర్ సిగరెట్ వెలిగించాడు.

"మీరేం చేస్తుంటారు?..." సాగర్ అడిగేడు.

"మెడికల్ రిప్రెజెంటేటివ్‌గా ఉన్నాను. విజయ వాడలో కాన్ఫరెన్సు ఉంటే వెడుతున్నాను."

తానెవరో? ఆమె ఎవరో?... ఆమె పట్ల తనకు ఏర్ప డ్డది ఆకర్షణా?... లేకపోతే వ్యామోహమా??—

ఛీ! ఏమిటి పిచ్చి ఆలోచనలు?

ఆమె చూపు...చిరునవ్వు తనను వెర్రెక్కిస్తున్నయ్.

జీవితాంతం కాకపోయినా కనీసం ఒక్క రోజు ఆమెతో ఏకాంతంగా గడిపితే చాలు. ఎవరో చెంపమీద ఛెళ్ళున చరిచినట్లనిపించింది. అది అతని అంతరాత్మ.

"అవునూ, మీది విజయవాడేనా?" ఈ ప్రశ్న ఈ సారి మల్లీప్రియ నుద్దేశించి అన్నాడు.

"కాదు. అక్కడ ఇంటర్వ్యూకెడుతున్నాను. అక్కను కూడా తోడుగా వెంట తీసుకెడుతున్నాను." టక్కున సాగర్ జవాబిచ్చాడు.

"మాకు ఆ వూరు పూర్తిగా కొత్త! పైగా బంధు వులు కూడా ఎవరూ లేరు." మల్లీప్రియ అర్ధోక్తిలో ఆగి పోయింది.

'హమ్మయ్య!... ఇంకేం... అంతా కలిసి ఒకే హోటల్లో దిగవచ్చు" అనుకున్నాడు కుమార్.

"నేను ఎప్పుడూ హోటల్ మనోరమలో దిగుతుం టాను" అన్నాడు కుమార్ సిగరెట్ ని కిటికీలోంచి బైటికి విసిరేస్తూ.

"అది చాలా ఖరీదయిన హోటలనుకుంటాను." అడిగేడు సాగర్.

డబ్బు గురించి కాదు మనం ఆలోచించాల్సింది అక్కడ సర్వ సదుపాయాలూ ఉంటయ్."

సాగర్, మల్లీప్రియ ఒకరి ముఖాలు మరొకరు చూచుకున్నారు.

"మీరు నన్ను పరాయివాడిలా భావించవద్దు. ఎక్కడో దిక్కుమాలిన హోటల్లో దిగి మీరు ఇబ్బందిపడనూ వద్దు. స్నేహానికి ప్రాణమిచ్చే మనిషి న్నేను! ఒకసారేమైందో తెలుసా? — నేను హైదరాబాద్ నుండి డీలక్సు బస్సులో తిరుపతి వెళ్ళుతున్నాను. కర్నూలు బస్ స్టాండ్ లో కాఫీకి దిగుతుంటే తోటి ప్రయాణీకుడి పర్సు కొట్టేశారు. ఆ పెద్ద మనిషి నీరు కారిపోయేడు. తిరుపతి దాకా వచ్చి తిరిగి మళ్ళీ తన ఊరు చేరుకుందుకు డబ్బుల్లేక పోయినయ్ ఆయన పర్సు కాస్తా పోవటంతో తోటి ప్రయాణీకులను అడిగేటందుకు అభిమాన పడ్డాడు. చివరికి నేనే సాహసించి రెండు వందలు సర్దాను. ఆ తర్వాత ఆయన నాకు ఊరెళ్ళగానే మనియార్డరు చేశాడనుకోండి." ఒక బుల్లి ఉపన్యాసం లాంటిది దంచేశాడు కుమార్.

'మీరు చాలా మంచివారులా ఉన్నారు' అనే భావనతో కుమార్ కేసి లప్లీగా చూసింది మల్లీప్రియ.

చురుగ్గా ఆమె ముఖంలోకి చూశాడు కుమార్. తన రొట్టె విరిగి నేతిలో పడబోతున్నందుకు సంబరబడ్డాడు.

"అసలు నేను ఫస్ట్ క్లాస్‌లో తప్ప ట్రావెల్ చెయ్యను. అలాంటిది మీతో పరిచయం రాసిపెట్టి ఉందేమో సెకండ్ క్లాస్ టిక్కెట్టు ప్రాప్తమయింది." మరో చెణుకు విసిరేడు.

చెరువులో చేపను చేజిక్కించుకోవాలని వల విసిరే ప్రయత్నంలో వున్నాడు కుమార్.

ఒంగోలులో రైలాగింది.

ముగ్గురూ కేంటిన్ వైపు నడిచారు.

కుమార్ మూడు మీల్స్ టిక్కెట్లు తీసుకున్నాడు. పక్కకు తిరిగి నవ్వుతూ "నా చొరవకు మీరేం ఆశ్చర్యపోనక్కర్లేదు. స్నేహానికి ప్రాణమిచ్చే మనిషిన్నేను. "ఐ లైక్ ఫ్రెండ్స్!" అన్నాడు.

భోజనాల కార్యక్రమం ముగించుకొని ముగ్గురూ కేంటీన్లోంచి బైటికొచ్చారు.

సాగర్ ముందు నడుస్తున్నాడు.

కుమార్ మల్లీప్రియ పక్కపక్కనే నడుస్తున్నారు.

నడుస్తూనే ఏమీ ఎరుగని వాడిలా ఆమె చేతికి తన

చెయ్యి తగిలించాడు కుమార్. ఇంకా ఆమెకు దగ్గరగా నడవాలని ట్రై చేస్తున్నాడు.

ఆమెలో నెగటివ్ రెస్పాన్సు కనిపించక పోవడంతో ముందుగా కుమార్ కంపార్టుమెంటులోకి ఎక్కి, ఎంట్రెన్స్‌లో నిలబడి చెయ్యి ముందుకు అందించాడు ఆమెను పైకి లాగా లనే ప్రయత్నంతో.

తన ప్రతి చర్యను ఆమె అంగీకరిస్తున్నందుకు పొంగి పోతున్నాడు.

"ఐ లైక్ యు, మల్లీప్రియా! ఐ లవ్ యూ! చెవిలో రహస్యంగా చెప్పేడు.

సుతారంగా నవ్వుతూ "భలేవారండి మీరు" అంది.

అదొక కాంప్లిమెంట్‌గా భావించేడు కుమార్. రైలు కదిలింది.

* * * *

మనోరమ హోటల్లో కంపెనీ వాళ్ళు రిజర్వు చేసిన డబుల్ రూమ్‌లోనే మల్లీప్రియనీ, సాగర్‌నీ ఉంచగలిగే చొరవ తీసుకున్నాడు కుమార్.

తన ప్రయత్నం సఫల మవబోయే అంతిమ క్షణం ఆసన్నం కాబోతున్నందుకు కుమార్ సంబరపడుతున్నాడు.

అప్పటికి ఉదయం తొమ్మిది గంటలు కావస్తోంది. సాగర్ స్నానంచేసి బట్టలు మార్చుకున్నాడు. కాని ఇంట

ర్యావ్లకి ఇంకా బయల్దేరడేమని మనసులో గొణుక్కుంటు న్నాడు కుమార్.

సాగర్ బైటికి వెళ్ళిపోతే గదిలో మల్లీప్రియ ఒంట రిగా మిగులుతుంది. ఇప్పటికే తనమీద మల్లీప్రియకు సదభి ప్రాయం కలిగినట్లు గ్రహించ గలుగుతున్నాడు. తనను కాద నదు మల్లీప్రియ!

మరో అరగంటకి సాగర్ బైటికి వెళ్ళిపోయాడు. 'హమ్మయ్య!' పీడ విరగడైంది. వాడు మళ్ళీ సాయంత్రం ఆరు గంటల వరకూ రాకుంటే ఎంత బాగుండును అనుకున్నాడు కుమార్.

అప్పటివరకూ సోఫాలో కూర్చుని పేపరు చదువు తున్నట్టు నటిస్తున్న కుమార్ చేతిలో న్యూస్ పేపర్ అవతల పారేశాడు అసహనంగా.

అందమైన భంగిమలో బెడ్ మీద పడుకున్న మల్లీప్రియ 'ఫిలింఫేర్' తిర గేస్తూంది.

ఇంక ఆలస్యం చేయకూడదనిపించింది కుమార్ కి.

అప్పుడే తొందరపడితే సాగర్ తమని టెస్ట్ చేసే ఉద్దే శంతో టక్కున తిరిగొస్తే తాను దొరికిపోవలసి వస్తుంది. అందుకే కొంత వ్యవధి తీసుకోవటం మంచిదనిపించింది.

"ప్రియా! నీవేం చదువుకున్నావ్?" కావాలనే ఏక వచన ప్రయోగం చేశాడు కుమార్.

మల్లీప్రియ పదివేళ్ళు చూపింది.

"మాట్లాడితే నోటిముత్యాలు రాలిపోతాయా?" సిగరెట్ లైటర్‌తో వెలిగిస్తూ అడిగేడు.

ఆ మాటకి కిలకిలా నవ్వింది.

"మీ తమ్ముడొచ్చేదాకా నువ్వొక్కదానివే కదా...?"

'మీరున్నారుగా!' అనే భావనతో ఒక చూపు కుమార్ వైపు విసిరింది మల్లీప్రియ.

ఏమిటీ చొప్పదంటు ప్రశ్నలు అనవసరంగా. కార్యరంగంలోకి త్వరగా దూకక అనిపించింది కుమార్‌కి.

ఒకవైపు భయం. మరోవైపు ఆరాటం. కుమార్‌ని తికమక పెట్టసాగాయి.

తనను సభ్యత సంస్కారం వున్న వ్యక్తిలా అనుకుంటున్నప్పుడు తాను తొందరపడితే తనను ఒక నీచుడిలా జమకట్టవచ్చు. అంతటితో ఆగక పోలీసు రిపోర్టూ ఇవ్వొచ్చు.

ఛ.. ఛ. మల్లీప్రియ అలాంటి ఆడపిల్లలా, గడుగ్గాయిలా కనిపించటం లేదు.

మల్లీప్రియ 'ఫిలింఫేర్'ని గుండెమీద ఆన్చుకుని కళ్ళు మూసుకుని పడుకుంది.

"వోస్ అంతేకదా. డోన్ట్ వర్రీ" అనేసి పాంటు జేబులో పర్సు అందుకుని రెండు పచ్చ నోట్లు బయటికి తీసి సాగర్‌కి అందించాడు. తన విజిటింగ్ కార్డూ ఇచ్చాడు.

సాయంత్రం ఆరు గంటల బండికి వాళ్ళు బయలుదేరి వెళ్ళిపోయే ప్రయత్నంలో ఉన్నారు.

కుమార్ వాళ్ళని సాగనంపే ఉద్దేశంతో వెంట నడిచి హోటల్ కౌంటర్ దాకా వచ్చాడు. వాళ్ళని ఆటో ఎక్కించాడు.

మల్లీప్రియ వెళ్ళిపోతూ చెయ్యి వూపింది. చిరునవ్వు నవ్వింది. వాళ్ళు వెళ్ళిపోతుంటే కుమార్ మదిలో దిగులు చోటు చేసుకుంది.

"ఆ అమ్మాయి నీకెలా పరిచయంరా?" భుజం మీద చెయ్యివేస్తూ కాన్ఫరెన్సుకొచ్చిన ఒక మిత్రుడు అడిగాడు.

ఉలిక్కిపడి పక్కకు తిరిగాడు కుమార్.

"అనుకోనట్టుగా ట్రెయినులో తారసపడ్డది. పాపం చాలా మంచి పిల్ల. ఫామిలీ గరల్". అదోలా నవ్వి బదులు పలికాడు కుమార్.

ఓరి ఫూల్. ఆమె ఫామిలీ గర్ల్ అని నీకెవరు చెప్పారు, పక్కనున్న కుర్రాడు కోశాడా? అయితే నిన్ను వాళ్ళు బుట్టలో వేశారన్నమాట".

ఫ్రెండు మాట విన్న కుమార్‌కి మతిపోయినట్టని పించింది. ఆశ్చర్యంగా స్నేహితుడి ముఖంలోకి చూశాడు.

"ఫామిలీ గర్ల్ అయితే ముక్కు ముఖం తెలీకుండా నీ రూములో ఉంటుందని ఎలా అనుకున్నావురా' సన్యాసీ? నువ్వు వాళ్ళని వంచించావ్. వాళ్ళు నీకు కుచ్చులు టోపీ తొడిగి వెళ్ళిపోయారు".

ఫ్రెండు మాటలు కుమార్‌కి బోధపడటం లేదు. ప్రశ్నార్థకంగా అతని ముఖంలోకి చూశాడు కుమార్.

"ఆమె పక్కా తిరుగుబోతు. ఆమెను అడ్డం పెట్టుకొని ఆ కుర్రాడు హైక్లాస్ వ్యాపారం చేస్తూంటాడు".

"ఇదంతా నీకెలా తెలుసు?"

"ఒకసారి తెలీక నేనూ నీకు మల్లే మోసపోయాను. తరువాత నిజమేమిటో తెలిసింది. పోనీలే. ఫర్గెట్ ఎబౌటిట్" కుమార్ భుజం తట్టాడు ఫ్రెండు.

'హారినీ! ఎంతగా మోసపోయాను? ఎంతో అనుభవమున్న తాను కూడా చివరికి మోసపోవాల్సి వచ్చిందన్న మాట. అని లోలోపలే గొణుక్కున్నాడు కుమార్.

[ 12-12-79 ] [ ప్రభ వార పత్రిక ]

FOR BEST QUALITY CHOOSE

MARK

GOAT **79** BEEDIES




## V. Abdul Jabbar Sahib & Sons,

**P. B. No. 419** **15, 16, Long Bazar**

**VELLORE - 632 004**

(N. A. Dt.) Tamil Nadu

---

*Sales Representative :*

**S. A. KHADAR MOHIDEEN** *alias* **S. A. NAWAB**

*Phone* : **79** **CHITTOOR (A. P.)**

రుచికి ! శుచికి !! శుభ్రతకు !!!

దర్శించండి !!!

# శ్రీ వల్లీ భవన్

ఫలహార మరియు భోజన హోటల్

పొన్నియమ్మ గుడి వీధి, చిత్తూరు. (A. P.)

# SRI PRAKASH HARDWARE & GENERAL STORES

**Dealers in Iron Rods, Sheets, Flats, Bolts & Nuts**

**Bazar Street,** **CHITTOOR.**

10—3—32

***Phone: 2747***